
వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
TGTEL/25/A4812
తెలుగు దినపత్రిక
సంపుటి : 01| సంచిక : 52 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | జూన్ 03, 2026



## తెలంగాణ, జర్మనీ దేశాల మధ్య కీలక ఒప్పందం..

2లో..

- తెలంగాణ, జర్మనీ దేశాల మధ్య కీలక ఒప్పందం..
- అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర యువత
- టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం
- థురింగియా సీఎం మారియో వోయిట్ బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి భేటీ
- గ్లోబల్ మార్కెట్‌కు తగ్గట్టుగా యువతను తీర్చిదిద్దడమే లక్ష్యం
- త్వరలోనే తెలంగాణకు జర్మనీ సెమీకండక్టర్ల ప్రతినిధి బృందం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్రం అంతర్జాతీయ పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. జర్మనీలోని ప్రముఖ 'థురింగియా' రాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం ఒక చారిత్రాత్మక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందం జరిగింది. హైదరాబాద్ సందర్శనలో ఉన్న జర్మనీ థురింగియా రాష్ట్ర ముఖ్యమంత్రి మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో..

### సోదరుడిగా వస్తే
## బిర్యానీ పెడతాం..

- అంతేకానీ ఇక్కడి సచివాలయంలో వేలు పెడితే ఊరుకోం
- తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు?
- ఉల్టాపల్టా మాటలెందుకు?
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ ఘాటు కౌంటర్!



2లో..

## డీకే ప్రమాణ స్వీకారంలో సీఎం రేవంత్ రెడ్డి..

- ఆలింగనంతో ఆప్యాయత చాటిన శివకుమార్
- హాజరైన పలు రాష్ట్రాల సీఎంలు, కాంగ్రెస్ అగ్రనేతలు



**బెంగళూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీ.కె. శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసిన చారిత్రాత్మక ఘట్టానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరయ్యారు. బెంగళూరులో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి దేశంలోని పలువురు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అగ్రనేతలు తరలివచ్చారు. వేదికపైకి చేరుకున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కర్ణాటక నూతన సీఎం డి.కె. శివకుమార్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని తన అభిమానాన్ని, ఆప్యాయతను చాటుకున్నారు. ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో పాటు కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీషన్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలు ప్రత్యేకంగా పాల్గొన్నారు. కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డి.కె. శివకుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలంగాణలో భూముల మార్కెట్ విలువల సవరణ

- జూన్ 5 నుంచి కొత్త ధరలు అమలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో భూములు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సవరించిన ఈ కొత్త మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితులు, రిజిస్ట్రేషన్ల ధోరణి మరియు భూములకు ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని అత్యంత శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.



2లో..

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు రాజ్యాంగ రక్షణ లేదు



2లో..

- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే..
- డబ్బులు పందెం కాస్తే అది జూదమే

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ, దానికి ఎలాంటి రాజ్యాంగ రక్షణ ఉండబోదని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను న్యాయస్థానం పూర్తిగా సమర్థించింది.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
బుధవారం, జూన్ 03, 2026

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు రాజ్యాంగ రక్షణ లేదు

- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే..
- డబ్బులు పందెం కాస్తే అది జూదమే



(మొదటి పేజీ తర్వాత .. ) ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి అధికారాలు ఉన్నాయని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, ప్రజల శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని తాము సమర్థిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి డిజిటల్ యాప్‌లలో డబ్బులను పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. అటువంటి ఆటలు ఆడటానికి కొంత నైపుణ్యం అవసరమైనప్పటికీ.. వాటిపై డబ్బులు పెట్టి పందేలు కాస్తే అది ఖచ్చితంగా 'జూదం' కిందకే వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల శాశ్వత నిషేధానికి మార్గం సుగమమైంది. ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనాల వల్ల లక్షలాది మంది యువకులు అప్పులపాలవుతున్నారని, తీవ్ర మనోవేదనతో ప్రాణాలు కోల్పోతున్నారని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. యువత ఆత్మహత్యలు చేసుకుంటున్న ఆందోళనకర సామాజిక పరిస్థితులను, కుటుంబాలు రోడ్డున పడుతున్న ఉదంతాలను క్షుణ్ణంగా పరిగణనలోకి తీసుకునే ఈ కీలక తీర్పును వెలువరిస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం తన తీర్పులో స్పష్టంగా పేర్కొంది.

# తెలంగాణ, జర్మనీ దేశాల మధ్య కీలక ఒప్పందం..

- తెలంగాణ, జర్మనీ దేశాల మధ్య కీలక ఒప్పందం..
- అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర యువత
- టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం
- థురింగియా సీఎం మారియో వోయిట్ బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి భేటీ
- గ్లోబల్ మార్కెట్‌కు తగ్గట్టుగా యువతను తీర్చిదిద్దడమే లక్ష్యం
- త్వరలోనే తెలంగాణకు జర్మనీ సెమీకండక్టర్ల ప్రతినిధి బృందం



(మొదటి పేజీ తర్వాత.. ) ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో వస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మార్పులను తట్టుకునేలా తెలంగాణ యువతను సన్నద్ధం చేయాల్సి ఉందన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మన యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. అందుకోసం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ', అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధనా విధానాలను ఆధునీకరించేందుకు థురింగియా సాంకేతిక సహకారం అందించాలని కోరారు. సీఎం ప్రతిపాదనలపై థురింగియా సీఎం మారియో వోయిట్ సానుకూలంగా స్పందిస్తూ.. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను రూపొందించేందుకు తమ దేశ పరిశ్రమలు, విద్యాసంస్థలు సిద్ధంగా ఉన్నాయని ప్రకటించారు. ఇప్పటికే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా విజయవంతంగా సాగుతున్న జర్మన్ భాషా శిక్షణను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌పై థురింగియా సీఎం మారియో వోయిట్ ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణను భారతదేశంలోనే అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా ఆయన అభివర్ణించారు. "భారత్-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇంతటి అద్భుతమైన వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం." అని — మారియో వోయిట్, థురింగియా సీఎం అన్నారు. భేటీలో భాగంగా సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని త్వరలోనే తెలంగాణకు పంపుతామని, ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చిస్తామని జర్మనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రతిపాదనను పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు హృదయపూర్వకంగా స్వాగతించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీకండక్టర్ కంపెనీలు విజయవంతంగా నడుస్తున్నాయని, త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ దేశంలోనే ముందంజలో నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# సోదరుడిగా వస్తే బిర్యానీ పెడతాం..

- అంతేకానీ ఇక్కడి సచివాలయంలోవేలు పెడితే ఊరుకోం
- తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు?
- ఉల్టాపల్టా మాటలెందుకు?
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కుకేటీఆర్ ఘాటు కౌంటర్!

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "తెలంగాణ ఖచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్‌ను మేము గౌరవిస్తాం. సోదరుడిగా మా ఇంటికి వస్తే హైదరాబాద్ బిర్యానీ పెట్టి ఆదరిస్తాం.. అంతేకానీ, మా సచివాలయంలో కూర్చుంటామంటే మాత్రం కుదరదు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున విభజన తీరు సరిగా లేదని పవన్ వ్యాఖ్యానించడంపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు ఇక్కడికి వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన వీర నేల ఇది. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన తెలంగాణపై పవన్ ఒకటికి రెండుసార్లు ఆలోచించి మాట్లాడాలి" అని హితవు పలికారు. దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయవచ్చని, అయితే పోటీ చేసే ముందు ఆ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించాలని సూచించారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమన్న పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. "నాడు మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు.. మరి దాన్ని కూడా ప్రాంతీయవాదం అంటారా? నేడు ప్రధాని మోదీ తన ప్రాంతీయవాదంతో తెలంగాణకు రావాల్సిన పరిశ్రమలను త ర లిం చు కు పో తు న్నా రు . జాతీయవాదం ముసుగులో జరుగుతున్న ఈ ఆర్థిక ప్రాంతీయవాదానికి పవన్ సమాధానం చెప్తారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణకు కేసీఆరే దిక్సూచి అని, ఇక్కడ జనసేన కొత్తగా చేసేదేమీ లేదన్నారు. తెలంగాణ ఏర్పాటు వెనుక కాంగ్రెస్ చేసిన అణచివేతను కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. "1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణలను కలిపింది కాంగ్రెస్సే. 1969 ఉద్యమంలో 379 మందిని, మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది ఆ పార్టీయే. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్. కేసీఆర్ గారి పోరాటం, ఆమరణ దీక్ష వల్లే తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది" అని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం అద్భుతమైన అభివృద్ధి సాధించిందని, తమ కంటే ఎక్కువ అభివృద్ధి చేసినట్లు కాంగ్రెస్, బీజేపీలు నిరూపిస్తే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు గుప్పిస్తూ.. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పులు చేయడంలో రికార్డులు సృష్టిస్తోందని ఆరోపించారు. కేవలం రెండున్నరేళ్ల పాలనలోనే రూ. 4 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ అప్పులపై ఒక్కో మంత్రి ఒక్కో లెక్క చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇప్పటికే కరోనా కంటే కాంగ్రెస్సే అత్యంత ప్రమాదకరమని అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

# తెలంగాణలో భూముల మార్కెట్ విలువల సవరణ

- జూన్ 5 నుంచి కొత్త ధరలు అమలు
- మంత్రి పొంగులేటి



(మొదటి పేజీ తర్వాత .. ) రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలపై గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు సమగ్ర అధ్యయనం చేశాయని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, కొత్త రోడ్ల నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ జరిగిన ప్రాంతాలలో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, వాటిని ప్రమాణాలుగా తీసుకుని మార్కెట్ విలువలను సవరించినట్లు పేర్కొన్నారు. అయితే, ఇప్పటికే మార్కెట్ ధరలు అధికంగా ఉన్న ప్రాంతాలలో కొత్తగా ధరల పెంపు ప్రతిపాదనలు లేవని ఆయన స్పష్టం చేశారు. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ఫ్లాట్లకు ఒకే మార్కెట్ విలువను వర్తింపజేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండీఏ , మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర పట్టణ ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను ప్రభుత్వం ఖరారు చేసింది. వ్యవసాయ భూములు, ఫ్లాట్లతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్మాణ రేట్లను కూడా సవరించింది. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు భారీగా పెరగడంతో ఈ మార్పులు అనివార్యమయ్యాయన్నారు. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువలను నూతనంగా సవరించారు. భూ లావాదేవీలలో పారదర్శకతను పెంచడం, క్షేత్రస్థాయి మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను తీసుకురావడమే ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాల మేరకే, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రక్రియను పూర్తి చేశామని ఆయన వివరించారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, జూన్ 03, 2026

# వేములవాడ పాలకవర్గం 'స్టడీ టూర్'

- ఆధునిక మార్కెటింగ్ విధానాలపై అధ్యయనం
- వివిధ ప్రాంతాల మార్కెట్ యార్డుల సందర్శన
- రైతులకు మేలు చేయడమే లక్ష్యం
- చైర్మన్ రొండి రాజు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు, మార్కెటింగ్ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను పరిశీలించేందుకు ఒక ప్రత్యేక స్టడీ టూర్ చేపట్టారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు నేతృత్వంలో పాలకవర్గ సభ్యుల ఉన్నత స్థాయి బృందం వివిధ ప్రాంతాల్లోని ప్రముఖ వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించడానికి తరలివెళ్లింది. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లలో తీసుకురావాల్సిన సంస్కరణలపై ఈ బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేస్తోంది.

### ఈ-నామ్ విధానంపై అధ్యయనం

ఈ సుదీర్ఘ పర్యటనలో భాగంగా ఆయా ప్రాంతాల్లో రైతులు పండిస్తున్న వివిధ రకాల సాంప్రదాయ, వాణిజ్య పంటలను, వాటి సాగు పద్ధతులను పాలకవర్గ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా, అక్కడి మార్కెట్ యార్డులలో రైతులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, పంటల కొనుగోలు ప్రక్రియ, వేలం పాటల నిర్వహణ, ఈ-నామ్ విధానం అమలు, మరియు నిల్వ సామర్థ్యానికి సంబంధించిన ఉత్తమ మేనేజ్‌మెంట్ పద్ధతులను అక్కడి అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు.

### వేములవాడ మార్కెట్ బలోపేతమే ధ్యేయం

వివిధ మార్కెట్లలో విజయవంతంగా అమలువుతున్న మేలైన పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని వేములవాడ మార్కెట్ యార్డులో కూడా ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఈ పర్యటన ఎంతగానో దోహదపడుతుందని కమిటీ భావిస్తోంది. ఇతర ప్రాంతాల్లోని మార్కెట్లలో ఉన్న అనుకూలతలను మన వద్ద కూడా ప్రవేశపెట్టడం ద్వారా స్థానిక రైతులకు దళారీల బెడద లేకుండా, మద్దతు ధర లభించేలా చేయవచ్చని చైర్మన్ రొండి రాజు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్కెట్ యార్డులలో ఎలా ఉపయోగించుకోవచ్చో తెలుసుకోవడానికి ఈ అధ్యయన పర్యటన ఒక మంచి అవకాశమని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా సాగుతున్న ఈ పర్యటనలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్‌తో పాటు డైరెక్టర్లు కత్తి కనకయ్య, ఖమ్మం గణేష్, పాలకుర్తి పరశురాం, చెరుకు శంకర్, మానుపాటి పరుశురాం తదితరులు పాల్గొన్నారు. వీరంతా ఆయా ప్రాంతాల మార్కెట్ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై, మార్కెట్ల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

# సర్కారు బడుల్లో 'బడిబాట' పండుగ..

- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం
- కార్పొరేట్ స్థాయి విద్యా ప్రమాణాలు, ఉచిత సదుపాయాలు
- హెచ్ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమం వేములవాడ పట్టణంలో ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా న్యూ అర్బన్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బడిబాట ఆవశ్యకతను, ప్రతిజ్ఞ యొక్క పూర్తి వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ అందరికీ వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బడిబాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, పాఠశాల వయసున్న పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యా ప్రమాణాలను అందిస్తున్నామని, అలాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రత్యేక సహాయాన్ని కూడా అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభించే ఉచిత సదుపాయాలు, నిష్ణాతులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన, విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ, రోజూ పౌష్టికాహారంతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజన సదుపాయం, పిల్లల శారీరక వికాసానికి ఉపయోగపడేలా విశాలమైన ఆట స్థలం ఉంటాయి. మేధావులు, విద్యావంతులు, మరియు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక సంఖ్యలో తమ పిల్లలను చేర్పించి, సర్కారు బడుల బలోపేతానికి తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ బడిబాట కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దుర్చేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు లిక్కిడి మంజుల, పులి శారదలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంపై బలమైన పోరాటాలకు సిద్ధం కావాలి

## జీపీ కార్మికులకు సీఐటీయూ పిలుపు



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతల నాగరాజు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కంసానిపల్లీ గ్రామంలో గ్రామపంచాయతీ కార్మికులను కలిసి, వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కార్మికుల హక్కుల సాధనకై చర్చించారు. ఈ సందర్భంగా చింతల నాగరాజు మాట్లాడుతూ.. నిరంతరం గ్రామాల పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. గత నాలుగు నెలలుగా నిలిచిపోయిన పెండింగ్ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా సాగిన ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి కలమండల సుల్తాన్, సిఐటియు మండల నాయకులు కుందేటి వెంకటయ్య, గ్రామ నాయకులు కాంపల్లి నిరంజన్, గ్రామపంచాయతీ కార్మికురాలు మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ సైబర్ క్రైం డీఎస్పీగా వెంకటరమణ

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ నూతన డీఎస్పీగా నియమించబడిన యం.వెంకటరమణ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల్లో సైబర్ నేరాలపై మరింత అవగహన కల్పించాలని సీపీ పేర్కొన్నారు. గతంలో ఇక్కడ సైబర్ క్రైమ్ డీఎస్పీగా పనిచేసిన కె.గిరికుమార్ మహబూబ్ నగర్ సైబర్ క్రైమ్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.

# ఉద్యమకారులను గౌరవించుకోవడం గర్వకారణం

- ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ
- మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం
- ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఉద్యమ నేతలు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులను అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు కీలక ఉద్యమకారుల త్యాగాలను, వారు చేసిన పోరాటాలను గుర్తుచేసుకుంటూ ఎమ్మెల్యే ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్ర పెత్తందారుల అరాచకాలు, వివక్ష పతాకస్థాయికి చేరిన తరుణంలో తెలంగాణ సమాజం మేల్కొందని ఈ సందర్భంగా ఉద్యమకారులు గుర్తుచేసుకున్నారు. "ఆనాడు నీళ్లు, నిధులు, నియామకాల్లో తీవ్ర అన్యాయం జరిగింది. ఏ ఉద్యోగం చూసినా 99 శాతం ఆంధ్ర ప్రాంతం వారికే కట్టబెట్టారు. ఈ అణచివేతను గమనించిన తెలంగాణ సమాజం ఒక్కతాటిపైకి వచ్చి ప్రత్యేక రాష్ట్రమే ధ్యేయంగా మలిదశ ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపింది" అని పేర్కొన్నారు. ఆ రోజుల్లో అచ్చంపేటలో జేఏసీ ఆధ్వర్యంలో కనివిని ఎరుగని రీతిలో ఉద్యమాలు జరిగాయని వివరించారు. ఆనాటి అచ్చంపేట జేఏసీ మీడియా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించిన మహబూబ్ అలీ లాంటి ఎందరో నేతలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరం రోడ్లపైనే ఉంటూ ఎన్నో పోరాటాలు చేశారు. నాడు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారిని గుర్తించి, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సన్మానించడం పట్ల ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సన్మానం తమకు ఎంతో గర్వకారణమని, జీవితకాలం గుర్తుండిపోయే విధంగా గౌరవించినందుకు ఎమ్మెల్యే వంశీకృష్ణకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# తాగునీటి ఎద్దడి రాకుండా అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశించారు. మండల పరిధిలోని మన్ననూర్‌లో గల మిషన్ భగీరథ పంప్ హౌస్‌లో మిషన్ భగీరథ మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని తాగునీటి సరఫరా, పంప్ హౌస్ నిర్వహణ, సుదీర్ఘ కాలంగా నిలిచిపోయిన పెండింగ్ పనులపై ఎమ్మెల్యే అధికారులతో క్షుణ్ణంగా చర్చించారు. ముఖ్యంగా వివిధ గ్రామాల్లో ఎదురవుతున్న తాగునీటి ఇబ్బందులను, వాటిని అధిగమించడానికి చేపట్టాల్సిన తక్షణ పరిష్కార మార్గాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎండకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి నీటి ఎద్దడి రాకుండా నిరంతరం నాణ్యమైన తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా తాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, ఎక్కడైనా లీకేజీలు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తితే యుద్ధప్రాతిపదికన స్పందించి పునరుద్ధరించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌తో పాటు మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు చెందిన ఈఈలు, డీఈలు, ఏఈలు, సంబంధిత విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉమామహేశ్వర దేవాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

- రెండోసారి చైర్మన్‌గా కొలువుదీరిన మాధవరెడ్డి
- కోటి రూపాయల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ
- శ్రీశైలం ఉత్తర ద్వార క్షేత్రానికి నిధుల వరాలు..
- భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** శ్రీశైలం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధి చెందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, అచ్చంపేట మండలంలోని రంగాపూర్ గ్రామ సమీప నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఆలయ ఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు అచ్చంపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌గా వరుసగా రెండోసారి కొండూరు మాధవరెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, వారితో పాటు నూతన పాలకమండలి సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

## నూతన పాలకమండలి కొలువుదీరిందిలా..

దేవస్థాన చైర్మన్‌గా మాధవరెడ్డితో పాటు పాలకమండలి సభ్యులుగా దాశరథి పవన్, వెంకటయ్య, శేఖర్రెడ్డి, ఇందిరమ్మ, శ్రీనివాసులు, సంబు శోభ, నోముల తిరుపతయ్య, సురేందర్ రావు, మల్లేష్ చారి, మత్రు నాయక్, దశరథం, సైదులు, లక్ష్మయ్య తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, ఈసారి పాలకమండలిలో గత కమిటీలోని ముగ్గురు సభ్యుల స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించడం విశేషం.



## రూ.కోటితో అభివృద్ధి పనుల శ్రీకారం

ప్రమాణ స్వీకార అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం సుమారు రూ. 1 కోటి వ్యయంతో చేపట్టనున్న వివిధ ప్రగతి పనులు, సీసీ రోడ్ల నిర్మాణానికి ఘనంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షేత్రానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన, నాణ్యమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంతో వైభవంగా సాగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని నూతన పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

> "ఉమామహేశ్వర క్షేత్ర మహిమను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించేలా నూతన పాలకమండలి అంకితభావంతో పనిచేయాలి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిరంతరం శ్రమించాలి."
>
> - ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

# రాజన్న క్షేత్రం, వేములవాడ పట్టణ అభివృద్ధి మా ప్రభుత్వానికి రెండు కళ్లు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- 'త్రి లైన్ బ్రిడ్జి' నిర్మాణ పనుల పరిశీలన
- రూ. 150 కోట్లతో ఆలయ అభివృద్ధి..
- ఇప్పటికే 25 శాతం పనులు పూర్తి
- గత ప్రభుత్వ హామీలు నీటి మూటలయ్యాయి

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధితో పాటు, పట్టణ ప్రగతి కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో శరవేగంగా కొనసాగుతున్న త్రి లైన్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక నజర్ ..

అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ, దృష్టితో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.



ఆలయ అభివృద్ధి కోసం రూ. 150 కోట్ల భారీ నిధులను కేటాయించామని, ఇప్పటికే దాదాపు 25 శాతం పనులు విజయవంతంగా పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. భక్తులకు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ పనులు జరుగుతున్నాయని వివరించారు.

## గత ప్రభుత్వానివి ఒట్టి శిలాఫలకాల డ్రామాలే..

ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విప్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకులు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. "ప్రస్తుతం నిర్మిస్తున్న మూడవ బ్రిడ్జికి ఆనాడు 2015 లోనే శంకుస్థాపన చేసి, ఆ తర్వాత గాలికొదిలేశారు. కేవలం శిలాఫలకాలు వేసి ప్రజలను మభ్యపెట్టే డ్రామాలు ఆడారే తప్ప, క్షేత్రస్థాయిలో చేసింది శూన్యం" అని మండిపడ్డారు. కనీసం బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా చేయకుండా కాలయాపన చేశారని ఆరోపించారు.

## భూసేకరణ పూర్తి.. పనుల్లో వేగం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. మూడవ బ్రిడ్జి నిర్మాణానికి ప్రధాన అడ్డంకిగా మారిన భూసేకరణ కోసం తమ ప్రభుత్వం రూ. 6.90 కోట్లు తక్షణమే విడుదల చేసిందని, ఆ తర్వాతే ఈ పనులు నల్లేరుపై నడకలా సాగుతున్నాయని గుర్తుచేశారు. రాజన్నను దర్శించుకునే భక్తులకు, వేములవాడ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచడమే ధ్యేయంగా యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేద పద్మశాలీ యువకుడి ప్రతిభ

- ర్యాంకుల 'శ్రీ వర్ధన్'గా గుర్తింపు
- ఎంసెట్‌లో 63వ ర్యాంక్..
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 900వ ర్యాంక్



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పేదరికం చదువుకు అడ్డుకాదని, పట్టుదల ఉంటే ఆకాశమే హద్దుగా రాణించవచ్చని నిరూపించాడు వరంగల్‌కు చెందిన ఓ నిరుపేద పద్మశాలీ విద్యార్థి. తండ్రి చికెన్ సెంటర్‌లో గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా.. ఆ కష్టాలను చూసి కుంగిపోకుండా చదువునే ఆయుధంగా మార్చుకున్నాడు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులతో సత్తా చాటి, వరంగల్ జిల్లా కీర్తి పతాకాన్ని దేశస్థాయిలో ఎగురవేశాడు. సాంబారి శ్రీ వర్ధన్ సాధించిన ఈ అసాధారణ విజయం ఇప్పుడు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. వరంగల్ జిల్లా కాశిబుగ్గకు చెందిన సాంబారి కల్పన, చంద్రమోహన్‌ల పెద్ద కుమారుడు సాంబారి శ్రీ వర్ధన్ ది అత్యంత నిరుపేద పద్మశాలి కుటుంబం. తండ్రి చంద్రమోహన్ వరంగల్ లోని ఒక చికెన్ సెంటర్లో గుమస్తాగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి గృహిణి. శ్రీ వర్ధన్ మొదటి నుండి చదువులో అత్యంత ప్రతిభ కనబరిచేవాడు. పదవ తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించి తన తెలివితేటలను నిరూపించుకున్నాడు. శ్రీ వర్ధన్ అసాధారణ ప్రతిభను గుర్తించిన నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం ఆ పేద విద్యార్థికి అండగా నిలిచింది. హైదరాబాద్‌లోని అన్నోజిగూడ సింగపూర్ సిటీ బ్రాంచ్‌లో రెండేళ్లపాటు కార్పొరేట్ స్థాయి ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా అందించింది. యాజమాన్యం నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రాత్రింబవళ్లు శ్రమించిన శ్రీ వర్ధన్ తాజాగా విడుదలైన జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో రికార్డు స్థాయి ర్యాంకులతో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో శ్రీ వర్ధన్ మూడు ప్రధాన విభాగాల్లోనూ టాప్ ర్యాంకులు సాధించి ఔరా అనిపించాడు. ఎంసెట్ స్టేట్ లెవెల్‌లో 63వ ర్యాంక్ సాధించి సంచలనం సృష్టించాడు. ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరీలో 900వ ర్యాంక్, ఓబీసీ కేటగిరీలో 154వ ర్యాంక్ సాధించాడు. జేఈఈ మెయిన్స్ ఓపెన్ కేటగిరీలో 1258వ ర్యాంక్, ఓబీసీ కేటగిరీలో 220వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఆల్ ఇండియా లెవెల్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీ వర్ధన్‌ను నారాయణ విద్యాసంస్థల అన్నోజీగూడ కో–ఆర్డినేటర్ చెరుకు రఘుపతి రెడ్డి, ఏజీఎంలు పి. అరుణ్ కుమార్, అనిల్ గవాస్కర్‌లు ప్రత్యేకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. నిరుపేద పద్మశాలి బిడ్డ దేశస్థాయిలో రాణించడం పట్ల 'తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం' రాష్ట్ర, జిల్లా నేతలు హర్షం వ్యక్తం చేశారు.